క్లుప్తంగా

వైభవంగా బాలయోగీశ్వరుల తీర్థ మహోత్సవాలు

ముమ్మిడివరం: భగవాన్ శ్రీబాలయోగీశ్వరుల తీర్థ మహోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. బాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తమిళనాడుకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. తపో ఆశ్రమంలో భక్తులు బారులు తీరారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కాశి బాలమునికుమారి, పెన్మత్స చిట్టిరాజు బాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకుని పూజలు చేశారు. ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య, ఎస్‌ఐ డి.సురేష్‌బాబుల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఓటు హక్కు విలువ తెలుసుకోవాలి

అమలాపురం టౌన్: ప్రతిఒక్కరూ ఓటు హక్కు విలువ తెలుసుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీఐఈఓ) వనుము సోమశేఖరరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యా శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పట్టణంలో జరిగిన అవగాహన ర్యాలీని సోమశేఖరరావు జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పుర వీధుల్లో సాగింది. ఎన్నికల్లో ప్రతి ఓటరు విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఐఈఓ సోమశేఖరరావు విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో పలు ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పట్టాలతో పేదల్లో ఆనందం

అమలాపురం టౌన్: జగనన్న ఇళ్ల పట్టాలతో పేదల ఆనందానికి అవధుల్లేవని మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ అన్నారు. పట్టణంలోని 7, 8 వార్డులకు సంబంధించి పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా మంజూరైన 140 ఇళ్ల పట్టాలను స్థానిక వార్డు సచివాలయంలో వైస్ చైర్మన్ వెంకటేష్ శనివారం పంపిణీ చేసి ప్రసంగించారు. ఇళ్ల పట్టాలు పొందుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇవ్వడం మరింత శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో చిక్కం కిట్టు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ పక్షోత్సవాలు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక పీహెచ్‌సీలో సంపూర్ణ పోషణ పక్షోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రతిజ్ఞ చేసి 1000 రోజుల ప్రణాళికపై అవగాహన కల్పించారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండాలంటే సంపూర్ణ పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వి.మంగతాయారు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి పీహెచ్‌ఎన్ డి.విమలాదేవి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక వివేకానంద యోగాశ్రమం పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని పట్టణ సీఐ క్రిస్టోఫర్ అన్నారు. శనివారం యోగాశ్రమం సమకూర్చిన 500 దుప్పట్లను సీఐ క్రిస్టోఫర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేదలకు అందజేశారు. యోగాశ్రమ నిర్వాహకులు డాక్టర్ ఆకుల శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ సీతారామ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు


గొల్లవిల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: ప్రజా సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యమని, ఆయన హయాంలోనే ప్రతి గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని విలసవిల్లి, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి గ్రామాల్లో శనివారం ఆయన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. విలసవిల్లి రంగా సెంటర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, వానపల్లిపాలెంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.38 లక్షలతో నిర్మించిన 40 కిలోలీటర్ల ఓహెచ్ఎస్ఆర్‌ను, జీజీఎంపీ నిధులు రూ.8 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. గొల్లవిల్లిలో రూ.40 లక్షల జీజీఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లకు, ఆదిలక్ష్మీపురంలో రూ.11 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి, వాటర్‌ట్యాంకు నిర్మాణానికి, పాపాయి చెరు వు ప్రాంతంలో రెండు అంబేడ్కర్ విగ్రహాలకు రూ.7 లక్షలతో షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.

జగన్ చెప్పాడంటే చేస్తాడంతే

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏదైనా సరే చెప్పాడంటే చేస్తాడంతేనని, చంద్రబాబులా ఎన్నికలకు ముందు హామీలిచ్చి తరువాత వాటిని నెరవేర్చకుండా వదిలేసే నాయకుడు కాదని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం గొల్లవిల్లిలో జరిగిన వైఎస్సార్ నాలుగో విడత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున ఇప్పటికే నాలుగు విడతల్లో రూ.75,000 ఇచ్చారన్నారు. సీఎం జగన్ రాష్ట్రవ్యాప్తంగా రూ.25,000 కోట్లను చేయూతకు ఖర్చు చేశారన్నారు. 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించి వృద్ధులను ఆదుకుంటున్నారన్నారు. పిల్లల చదువుల కోసం అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో తల్లుల ఖాతాల్లో నగదును జమ చేస్తున్నారన్నారు. సీఎం జగన్ అధికారంలోకి రాగానే దాదాపు 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలను అందించారన్నారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు ఒక్కటంటే ఒక్క ఇంటి పట్టా అందించారా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు.

అనంతరం వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కును, జగనన్న భూసర్వే శాశ్వత భూహక్కు పథకంలో రిజిస్ట్రేషన్‌లు పొందిన లబ్ధిదారులకు పత్రాలను అందించారు. మండలంలోని విలసవిల్లిలో పండితులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న నక్షత్ర నవగ్రహ పూర్వక మహాసౌర యాగంలో మంత్రి పినిపే విశ్వరూప్ పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌లు సలాది ఊర్మిళాదేవి, కడిమి చిన్నవరాజు, జొన్నాడ శ్రీదుర్గ, యర్రంశెట్టి రామచంద్రరావు, నల్లా వెంకటేశ్వరరావు, కుంచే బుల్లియ్య, ఇసుకపట్ల జయమణి, పెయ్యల రాజ్‌కుమార్, ఉప సర్పంచ్‌లు మోకా శ్రీనివాసరావు, దొంగ కనకదుర్గ, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, వంగా గిరిజాకుమారి, కాట్రు ధనలక్ష్మి, బడుగు గణేష్, కొంకి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలి


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: ప్రభుత్వ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే రాష్ట్రంలో మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. మండల కేంద్రమైన తాళ్లరేవు-2 సచివాలయం పరిధిలోని గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక గిడ్లవారిపేట, కేశవపురం గ్రామాల్లో కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు రత్స ముత్యాలు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంతు వీరమోహన్, మండల సేవాదళ్ అధ్యక్షుడు భూసారపు పద్మారావు, నందికోళ్ల శ్రీమన్నారాయణ, విత్తనాల పండు పాల్గొన్నారు.

సీసీఎల్ విన్నర్ విజేత అమలాపురం జట్టు

అమలాపురం టౌన్: శివరాత్రి పర్వదినం సందర్భంగా స్థానిక శ్రీచెన్న మల్లేశ్వర కళాపరిషత్ గ్రౌండ్స్‌లో గత నాలుగు రోజులుగా ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరుగుతున్న చెన్నమల్లేశ్వర క్రికెట్ లీగ్ (సీసీఎల్) పోటీలు శుక్రవారం అర్ధరాత్రితో ముగిశాయి. పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 32 టీములు పాల్గొని తమ సత్తా చాటాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అమలాపురం హైస్కూలు ఎలెవెన్ జట్టు విన్నర్‌గా, రాజోలు మండలం జగ్గన్నపేట రాజేష్ ఎలెవెన్ జట్టు రన్నర్‌గా గెలిచి ట్రోఫీలు అందుకున్నాయి. విన్నర్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేలు నగదు బహుమతులు అందించినట్లు సీసీఎల్ నిర్వాహకులు పేరాబత్తుల ఫణి, ఉద్దీశ కిషోర్, సాయి తెలిపారు.

అల్లవరంలో పోలీస్ కవాతు

అల్లవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు రూరల్ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, అల్లవరం పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. అల్లవరం, ఓడలరేవు, బెండమూర్లంక, కొమరగిరిపట్నం తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించామని సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ హరీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల చెంతకే పాలన

మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: ప్రతి గ్రామంలో సచివాలయ ఏర్పాటుతో ప్రజల చెంతకే పాలన అందిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ అన్నారు. సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి అధ్యక్షతన గోడితిప్పలో రూ.44 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని మంత్రి విశ్వరూప్ శనివారం ప్రారంభించారు. ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ. 59 లక్షలతో గోడితిప్పలో నిర్మించిన కల్వర్టు, సీసీ రోడ్లు, సోలార్ లైట్లని ఎంపీ చింతా అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు నిర్మించి పూర్తి స్థాయిలో తాగునీరు అందిస్తున్నామన్నారు. అలాగే ప్రతి గ్రామంలో సీఎస్ఆర్, ఎంపీ ల్యాండ్స్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేశామన్నారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి గుర్తించి వైఎస్సార్ సీపీని ఆదరించాలన్నారు. అనంతరం మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రాకాపు విజయలక్ష్మి, బద్రే సీతారత్నం, మల్లాడి మంగాయమ్మ, తిక్కిరెడ్డి శ్రీను, సాధనాల వెంకట సూర్య నాగమణి, సొసైటీ చైర్మన్ గుర్రం బాబులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం చేయూత


చేయూత లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: మహిళా సాధికారత, మహిళల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా వైయస్సార్ చేయూత పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో శనివారం సాయంత్రం జరిగిన సభలో అమలాపురం రూరల్ మండలానికి సంబంధించి వైఎస్సార్ చేయూత నాలుగో విడత ఆర్థిక సాయం చెక్కును మహిళలకు మంత్రి విశ్వరూప్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున అందించి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడుతున్నామన్నారు. ప్రతి మండలానికి ఒక వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన సరకులు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో అక్కచెల్లెమ్మల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ యిళ్ల గోపాలకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, సర్పంచులు నక్కా అరుణ కుమారి, గుత్తుల చిరంజీవిరావు, రేలంగి దుర్గారావు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం


కేశనకుర్రులో పట్టాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

ఐ.పోలవరం: పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శనివారం కేశనకుర్రులోని నాలుగో లేఅవుట్‌లో 310 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. రాష్ట్రంలో 30 లక్షల ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, ఢిల్లీ నారాయణ, ఇందుకూరి రంగరాజు, మోకా రవి, చెల్లి రమాదేవి, కాశి పరివాజ్‌కుమార్, యలమంచిలి వాసు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి స్థలాలు అందించామని ముమ్మిడివరం ఎమ్మెల్యే, టీటీడీ పాలక వర్గ సభ్యుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. పల్లంకుర్రు సర్పంచ్ నాతి అలివేణి అధ్యక్షతన శనివారం లబ్ధిదారులకు ఇంటి స్థలాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీరు వ్యవస్థతో సంక్షేమ పథకాల లబ్ధిని ఇంటింటికీ అందించిన జగనన్న ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. అనంతరం పల్లంకుర్రు, కాట్రేనికోనలలో బూత్ కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి బూత్ కమిటీలే దిశా నిర్దేశమన్నారు. కాట్రేనికోనకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కొంకి శంకరుడు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో నాతి సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, గంటి వెంకట సుధాకర్ పాల్గొన్నారు.

వంట సామగ్రి బహూకరణ

ఐ.పోలవరం: వీరేశ్వర స్వామి అన్నదాన ట్రస్టుకు మురమళ్ల గ్రామానికి చెందిన భక్తుడు కేదారిశెట్టి శ్రీనివాస్ దంపతులు వంట సామగ్రి బహూకరించారు. శనివారం వీరేశ్వరస్వామి ఆలయంలో రూ.40 వేలు విలువ చేసే వంట సామగ్రిని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

కార్పెంటర్ల ఉపాధికి హామీ ఇవ్వాలి

అమలాపురం టౌన్: జిల్లాలోని కార్పెంటర్ల ఉపాధికి నిర్దిష్టమైన హామీలను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని జిల్లా కార్పెంటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా అసోసియేషన్ కార్యాలయం వద్ద శనివారం జరిగిన కార్పెంటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పెంటర్ల ఉపాధికి రూ.10 లక్షల సబ్సిడీ ఇవ్వాలని, 50 ఏళ్లు దాటిన కార్పెంటర్లకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. దంగేటి రామకృష్ణ, అప్పారి శ్రీనివాస్, కోమలి విఘ్నేష్, ముక్కామల వీరభద్రరావు, అంగర జగదీష్, జల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకస్వామి యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం స్వామికి పంచామృత అభిషేకాలు, నిత్యాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో బందా సత్యసాయి తన్మయి, శ్రీలలిత ఐశ్వర్యాంబిక నృత్య క్షేత్రంచే కూచిపూడి నృత్యం, సౌరా సత్య సూర్యనారాయణ భజన భక్తులను అలరించాయి.